క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



మదనాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సీపీఆర్‌పై ప్రభుత్వ ఉద్యోగులకు డాక్టర్ హరినాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఎవరైనా గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు సీపీఆర్ చేసి రోగి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. గుండెను రెండు చేతులతో ఒత్తిడి చేయడం ద్వారా ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేయడంతో శరీర భాగాలన్నింటికి రక్తం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రం, వైద్యాధికారి డాక్టర్ భవాని, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు రవీంద్రగౌడ్, కృష్ణయ్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



పాన్‌గల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శాగాపూర్, గోప్లాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో 132 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 17 మందికి కంటి అద్దాలు, ఆరుగురికి కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని కిష్టాపూర్, కిష్టాపూర్‌తండాల్లో మంగళవారం నుంచి కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేస్తున్నందున ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

సంత స్థలం మార్చాలని వినతి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం జరిగే వారాంతపు సంతను గతంలో మాదిరిగా పాత గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసరాల్లో ఏర్పాటు చేయాలని ఖిల్లాఘనపురం గ్రామస్తులు కిశోర్, విక్రం, సంతోష్ కుమార్, డాక్టర్ భూషణ్, శంకరయ్య తదితరులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గతంలో అక్కడే సంత జరిగేదని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. కరోనా సమయంలో సంతను ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోకి మార్చినట్లు వివరించారు. కుళ్లిన కూరగాయలు విద్యా సంస్థల పరిసరాల్లో పారవేయడంలో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పాత గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లోని వ్యాపార దుకాణాల వారు ఉపాధి కోల్పోతున్నారన్నారు.

చిత్రకళలో జాతీయ స్థాయిలో రాణించాలి



అమరచింత: పట్టణానికి చెందిన విద్యార్థిని నామాల ప్రవళిక చిత్రకళలో రాణిస్తూ జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని సినీ నిర్మాత, చేనేత వస్త్రాల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు అన్నారు. విద్యార్థిని ప్రవళిక తన చిత్రకళతో మహంకాళి శ్రీనివాసులు చిత్రపటాన్ని గీసి సోమవారం అందించారు. గతంలో ప్రవళిక ఎంతో మంది నాయకులు, జాతీయ నాయకుల చిత్రాలు వేసి రాష్ట్ర స్థాయిలో బహుమతులను అందుకోవడం అభినందనీయం అన్నారు. చేనేత కుటుంబంలో పుట్టి విద్యలో రాణిస్తూ చిత్రకళలో తన ప్రతిభ కనబరుస్తున్న ప్రవళిక భవిష్యత్తులో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థి ప్రవళికను శాలువా, పూలమాలతో అభినందించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, టీచర్ పాండు, శ్రీను, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఒక దరఖాస్తు

పెద్దకొత్తపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక దరఖాస్తు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బ్యాగరి తిరుపతయ్య తన భూమిని సర్వే చేయించి రిపోర్ట్ ఇవ్వాలని ఫిర్యాదు చేశాడు. సర్వేయర్ బాబునాయక్‌తో భూమి సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని తహసీల్దార్ ఆదేశించారు. వ్యవసాయ అధికారి రమేష్‌నాయక్, వైద్య సిబ్బంది చెన్నయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జగదాంబ, ఏపీఎం అరుణ సమావేశానికి హాజరయ్యారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- గోపాల్‌పేటలో పూర్తయిన సంపు నిర్మాణం
- వారంరోజుల్లో ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు



కేశంపేట సమీపంలో కొనసాగుతున్న పైప్‌లైన్ల పనులు



గోపాల్‌పేటలో పూర్తయిన సంపు నిర్మాణం

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంతో పాటు వనపర్తి మండలంలోని కొన్ని గ్రామాలు కలిసి మొత్తం 52 గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తొందర్లోనే తీరనున్నాయి. గతంలో మండలానికి కావాల్సిన తాగునీటిని రామన్‌పాడు వద్ద శుద్ధి చేసిన తర్వాత గోపాల్‌పేట సంపునకు, ఇక్కడి నుంచి గ్రామాలకు సరఫరా చేసేవారు. ఎండాకాలం వస్తే రామన్‌పాడు జలాశయంలో నీరు అడుగంటిపోవడం లేదా ఎక్కడో ఒకచోట పైప్‌లైన్ పగిలిపోవడం, లీకేజీలు వంటి సమస్యలతో మండల ప్రజలకు సరిగా తాగునీరు అందేవి కావు. సమస్యను గుర్తించిన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని తీసుకుని ఫిల్టర్‌చేసి ప్రజలకు ఎప్పటికీ తాగునీరు అందించవచ్చన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రితో మాట్లాడి తాగునీటి కోసం గోపాల్‌పేటలో 10 ఎంఎల్‌డీ, కానాయపల్లి వద్ద 20 ఎంఎల్‌డీ, బుగ్గపల్లితండాల వద్ద 75 ఎంఎల్‌డీ సంపుల నిర్మాణం కోసం రూ. 300 కోట్లు మంజూరు చేయించారు. వీటిలో భాగంగా ప్రస్తుతం గోపాల్‌పేటలో ఉన్న 10 ఎంఎల్‌డీ సంపు పనులు పూర్తి కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండుమూడు రోజుల్లో..

గోపాల్‌పేట సంపు వద్ద పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. పైప్‌లైన్ పనుల్లో మాత్రం ఏదుట్ల, కేశంపేట వద్ద రైతులు తమ పొలాలగుండా పైప్‌లైన్ పనులు చేపట్టొద్దని కొందరు అభ్యంతరం చెప్పడంతో ఆగిపోయాయి. దీంతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచనలతో ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక రైతులతో మాట్లాడి ఒప్పించారు. ఏదుట్ల వద్ద కిలోమీటర్ పనులు పూర్తికాగా కేశంపేట వద్ద రెండు కిలోమీటర్లకు గాను మొత్తం అయిపోయిందని, మరో వందమీటర్లు పనులు అయితే మొత్తం పూర్తయినట్లేనని అధికారులు చెప్పారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు అక్కడి నుంచి గొరిదేవిపల్లి వద్ద ఉన్న సంపు, అక్కడి నుంచి గోపాల్‌పేట సంపునకు నీళ్లు వస్తాయి. ఆ నీరు పలు దఫాల్లో ఫిల్టర్ అయిన అనంతరం ఉమ్మడి మండలంతో పాటు వనపర్తి మండలంలోని కొన్ని గ్రామాలకు మొత్తం 52 గ్రామాలకు సరఫరా చేస్తారు.

మంత్రికి ధన్యవాదాలు



రామన్‌పాడ్ నుంచి వచ్చే నీటి పైప్‌లైన్లు తరచూ పగిలిపోవడం, లీకేజీ సమస్యలు రావడం వల్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఎండాకాలంలో రామన్‌పాడ్‌లో నీరు తక్కువగా ఉండటంతో వారానికి ఒకసారి కూడా నీరు వచ్చేది కాదు. జిల్లా ప్రజల తాగునీటి సమస్య తీర్చాలనే ఉద్దేశంతో ఈ పథకానికి రూపకల్పన చేసిన మంత్రికి ధన్యవాదాలు.

– తిరుపతయ్య యాదవ్, రైతుబంధు అధ్యక్షుడు, గోపాల్‌పేట

నాలుగు రోజుల్లో..

ఏదుట్ల వద్ద రైతుల అభ్యంతరంతో పైప్‌లైన్ పనుల్లో కొంత జాప్యం జరిగింది. అధికారులు వారిని ఒప్పించడంతో రైతుల సహకారంతో ఇప్పుడు పనులు పూర్తయ్యాయి. అలాగే కేశంపేట వద్ద సైతం కిలోమీటరున్నర పైప్‌లైన్ ఏర్పాటు చేశాం. ప్రస్తుతం వంద మీటర్ల పైప్‌లైన్ పని ఉంది. అది బుధవారం లోపు అయిపోతుంది. అది అయిన వెంటనే ఉన్నతాధికారుల సూచన మేరకు ట్రయల్‌రన్ చేసి ఆతర్వాత నీటి శుద్ధీకరణ ప్రారంభిస్తాం

– శివరాజు, ఏఈ, మిషన్ భగీరథ

నర్సరీ మొక్కలపై ప్రత్యేక దృష్టి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండలంలోని రాయినిపల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండకుండా నీడ కోసం నెట్ ఏర్పాటు చేయాలని, వంద శాతం మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయితీ భవనాన్ని ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు పనులను పూర్తి చేసి త్వరగా ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు



మాట్లాడుతున్న డీటీ చక్రపాణి

పాన్‌గల్: ఓటరు జాబితాలో చనిపోయిన వారు, డబుల్ పేర్లు తొలగించి తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి బీఎల్ఓలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు ఆయన ఓటరు జాబితాపై అవగాహన కల్పిస్తూ సూచనలు, సలహాలను అందించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడం, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల అంశాలపై గ్రామాల్లో బీఎల్ఓలు అవగాహన కల్పించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే బీఎల్ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐలు మహేష్, తిరుపతయ్య, బీఎల్ఓలు పాల్గొన్నారు.

డ్రెయినేజీని నిర్మించండి



అమరచింత: పట్టణంలోని మూడో వార్డులో గల డ్రెయినేజీ కూలిపోవడంతో మురుగు రహదారిపైకి వచ్చి పరిసరాలు దుర్గంధంగా తయారవుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ తెలిపారు. అధికారులు వెంటనే డ్రెయినేజీని పరిశీలించి పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, రోజువారి చెత్త వాహనాలు వార్డులకు రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఇంట్లోని చెత్తను రహదారులు, కాల్వల్లో వేస్తున్న పరిస్థితులు దాపరించాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ వార్డుల సమస్యలను విస్మరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

స్వశక్తి కరణ్ అభియాన్ కమిటీలే కీలకం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న అనుజ్ఞారెడ్డి

ఖిల్లాఘనపురం: జిల్లాలోని ప్రతి బూత్‌లో 31 మందితో స్వశక్తి కరణ్ అభియాన్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ విస్తారక్ కేతూరి బుద్ధన్న, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మామిడిమాడ, పర్వతాపురం గ్రామాల్లో 9, 10, 13వ బూత్‌ల్లో స్వశక్తి కరణ్ అభియాన్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఈ కమిటీలతో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లోని ఓటరు లిస్టులలో ఒక్కో పేజీకి ఒక్కరు చొప్పున పన్నా ప్రముఖ్ నియమించామని తెలిపారు. వీరంతా కలిసికట్టుగా పనిచేసి ప్రతి గ్రామంలో బీజేపీ జెండాను ఎగరవేయడానికి నిరంతరం పనిచేస్తారని చెప్పారు. నరేంద్రమోదీ దేశంలోని పేదల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూనే మరో పక్క రాష్ట్రంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా సాగుతున్న పాలన గురించి ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అధికార మార్పు తప్పనిసరి అన్నారు. అనంతరం కొందరు గ్రామస్తులను కండువా కప్పి పార్టీలోకి తీసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, మండల ప్రధాన కార్యదర్శి అంజనేయులు ముదిరాజ్, యువమోర్చా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, శక్తికేంద్రం ఇన్‌చార్జ్ రవీంద్రాచారి, భద్రు, భాస్కరాచారి, మహిళా నాయకురాలు ఈదమ్మ, మండల ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కొండల్ పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో ఉపాధ్యాయ వృత్తికే వన్నె



వనపర్తిలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఖిల్లాఘనపురంలో..

వనపర్తి టౌన్: ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ.. భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు చేశారని గుర్తుచేశారు. అదేవిధంగా టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సమద్‌మియా, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జాన్, కృష్ణబాబు, నాయకులు బాబా, ఎల్లన్న, రాంరెడ్డి, అబ్దుల్లా, గంధం లక్ష్మయ్య, వెంకటేష్, లోకియా నాయక్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్, కవి గిరిరాజాచారి, దేవన్న నాయుడు, గంధం మదన్, వెంకటేశ్వర్లు, గంధం గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో సోమవారం మాజీ రాష్ట్రపతి ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో బస్టాండు ఆవరణలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అమరచింత: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవించే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని ఆత్మకూర్ ఫైర్ అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. ఆత్మకూర్ మండలంలోని లోయర్ జూరాల హైడల్ పవర్ ప్రాజెక్టు ఉద్యోగుల క్యాంప్‌లో సోమవారం అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ వాసన వస్తున్నప్పుడు అప్రమత్తంగా ఎలా వ్యవహరించాలి, ప్రమాదం నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నరేష్‌గౌడ్, సందీప్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ నరసింహ, భానుచందర్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ తోఫాలు పంపిణీ

పెద్దకొత్తపల్లి: రంజాన్ పండుగను పురస్కరించుకుని యాపట్లలో ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాలను ముస్లిం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బద్రుద్దీన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. జహంగీర్, గౌస్, సాధిక్, కబీర్, నిరంజన్, ఖాసీం, మునీర్, మజీద్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఆత్మకూర్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



అమరచింతలో ఇఫ్తార్‌లో పాల్గొన్న కేశం నాగరాజ్ గౌడ్

అమరచింత: ఆత్మకూర్ పట్టణంలోని పెద్ద మసీదులో సోమవారం ఉపవాస దీక్షాపరులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు నియమ నిష్ఠలతో ఉపవాస దీక్ష చేపట్టడం ఎంతో దైవకార్యమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ముస్లింలతో కలిసి పవిత్ర ప్రార్థనలో చేశారు. అనంతరం వారికి విందు ఏర్పాటు చేశారు. ఈమేరకు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింలను అన్ని రంగాల్లో ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి గంగాధర్‌గౌడ్, పట్టణ, మండల అధ్యక్షులు శ్రీనివాసులు, పరమేశ్, నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు తులసీరాజ్, వినయ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత పట్టణంలోని జామీయా మసీదులో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు, మహిళలకు టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, శ్యాం, తౌఫిక్, పోసిరిగారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలు నిరవధిక సమ్మె



పాన్‌గల్‌లో నిరవధిక సమ్మెలో పాల్గొన్న వీఓఏలు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, వీఓఏల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి ప్రదర్శించడం తగదంటూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద సోమవారం ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చర్చల పేరిట కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. వీఓఏల సమస్యలు, డిమాండ్లను నెరవేర్చకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో పావని, రంగన్న, రాధ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఐకేపీలో గ్రామ సహాయకులుగా (వీఓఏ) పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం ఐకేపీ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల రెగ్యులర్‌గా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. వీఓఏల నిరవధిక సమ్మెకు సీఐటీయూ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజయ్యగౌడు, శేషయ్య, బాలరాజు, శ్రీనివాసులు, రాజు, భాగ్యమ్మ, శశికళ, గంగాధర్, కృష్ణయ్య, పద్మ, కృష్ణయ్య, నరేష్, రమేష్ పాల్గొన్నారు.



అమరచింతలో మాట్లాడుతున్న రమేష్



మదనాపురంలో..

మదనాపురం: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మెకు మద్దతు పలికారు. కార్యక్రమంలో మన్యం, నారాయణ, జమ్మన్న, మునికుమార్, రాజశేఖర్, అలివేల, జయమ్మ, శ్రీలత, అరుణ, సువర్ణ, రాజేశ్వరి, శ్రీలత, స్వప్న, పద్మ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



చలివేంద్రం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: చలివేంద్రాలు వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చుతూ వారికి ఉపశమనం ఇస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలో శబరీనాథ్‌గౌడ్, అక్షయ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయని, వాటిలో దాహంతో అలమటిస్తున్న వారికి తాగునీటిని అందించడం ఎంతో ఉత్తమమైన సేవా కార్యక్రమం అన్నారు. కొన్నేళ్లుగా పట్టణంలో నీలగిరి సాలిమఠం అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం నిర్వహించడం అభినందనీయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు, గోపాలకృష్ణ గురుస్వామి, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, టీఆర్ఎస్ యూత్‌వింగ్ రాష్ట్ర కన్వీనర్ శ్రీలన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్, నరసింహులుగౌడ్, చిన్నబాలరాజ్, కేశవగౌడ్, పురుషోత్తంగౌడ్, కమలాకర్‌గౌడ్, అక్బర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌ని తొలగించాలి

పెద్దకొత్తపల్లి: మారేడుమాన్‌దిన్నె ఉపసర్పంచ్ శ్రీధర్‌రావును తొలగించాలని ఆ గ్రామ సర్పంచ్ సునీత, వార్డుసభ్యులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో చేపట్టిన పనులకు చెక్కులపై సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నందున గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్‌ని తొలగించాలని తీర్మానం చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అధికారులు గైర్హాజరు

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభరాణి, ఎంపీడీఓ కార్యాలయం నుంచి జూనియర్ అసిస్టెంట్ నిఖిత హాజరయ్యారు. ప్రజావాణికి ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ తెలియజేశారు.